
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★ గురువారం 29 ఫిబ్రవరి 2024



కార్మికవాడల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలి 8లో..

ఓసీపీ-2లో మొరాయిస్తున్న సైజర్ క్రషర్స్ 8లో..



కాంగ్రెస్ టికెట్‌పై ఉత్కంఠ

- సిట్టింగ్ ఎంపీ సహా పలువురి పోటీ
- దరఖాస్తు చేసుకున్న 29 మంది
- వారంరోజుల్లో ప్రకటించే అవకాశం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ టిక్కెట్‌పై ఉత్కంఠ నెలకొన్నది. ఎవరికి టికెట్ దక్కనున్నదనే అంశంపై సర్వత్రా చర్చ జరుగుతున్నది. టికెట్ కోసం ఇరవై తొమ్మిది మంది పార్టీ టీపీసీసీకి దరఖాస్తు చేసుకోగా, ఎవరికి వారుగా తమకు ఉన్న పలుకుబడిని ఉపయోగిస్తూ ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే మహబూబ్‌నగర్ అభ్యర్థిగా వంశీచందర్‌రెడ్డి పేరును ప్రకటించగా, మంగళవారం చేవేళ్లలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రసంగించినంత సేపు ఆయన పక్కనే నిల్చున్న జడ్పీ చైర్‌పర్సన్ సునీతకు చేవేళ్ల టికెట్ దక్కినట్లేనని కాంగ్రెస్ పార్టీలో చర్చ జరుగుతున్నది. 17 స్థానాలకు రెండు స్థానాల్లో అభ్యర్థులు ఎవరనేది ఒక కొలిక్కి వచ్చినప్పటికీ, మిగతా స్థానాల్లో అభ్యర్థుల ఎంపికపై పార్టీ మల్లాగుల్లాలు పడుతున్నది. పెద్దపల్లి పార్లమెంట్ నుంచి ఏ అభ్యర్థిని బరిలో నిలపాలనే విషయమై పార్టీ అధిష్ఠానం తర్జన భర్జన పడుతున్నట్లుగా కనబడుతున్నది. రాష్ట్రంలో 3 పార్లమెంట్ స్థానాలు ఎస్సీ సామాజికవర్గానికి చెందిన వారికి రిజర్వు అయ్యాయి. నాగర్ కర్నూల్, వరంగల్ పార్లమెంట్ స్థానాలకు ప్రకటించే అభ్యర్థులను బట్టి పెద్దపల్లి అభ్యర్థి ఎవరనేది తేలనున్నది. నాగకర్నూల్ టికెట్ తనకే కావాలంటూ మాల సామాజిక వర్గానికి చెందిన మల్లు రవి పట్టుబడుతున్న విషయం తెలిసిందే. ముందస్తుగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పదవికి కూడా రాజీనామా చేస్తున్నట్లు పార్టీ అధిష్ఠానానికి లేఖ పంపించారు. వరంగల్ టికెట్ మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారికి కేటాయిస్తే, పెద్దపల్లి టికెట్ నేతకాని సామాజిక వర్గానికి కేటాయించవచ్చనే చర్చ జరుగుతున్నది. అయితే పెద్దపల్లి టికెట్‌ను మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారికే ఇవ్వాలనే డిమాండ్ కొన్ని రోజులుగా వస్తున్నది. ఆ వర్గానికి చెందిన వివిధ సంఘాలు ఆయా వేదికలపై తమ స్వరాన్ని వినిపిస్తుండగా, ఢిల్లీకి వెళ్లి ఏఐసీసీ పెద్దలను కలిసి వినతిపత్రాన్ని కూడా సమర్పించారు.

● పార్లమెంట్ నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి..

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఒక్కసారి మాత్రమే మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఆగం చంద్రశేఖర్‌కు టికెట్ ఇచ్చారు. అంతకుముందు జరిగిన ఎన్నికల్లో మాల సామాజిక వర్గానికి చెందిన వారికి టికెట్ ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీ మాల సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు టికెట్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ నుంచి మాత్రం గడ్డం వివేక్ తనయుడు గడ్డం వంశీకృష్ణకే ఇవ్వాలంటూ పట్టుబడుతున్నారు. 1989 నుంచి 2014 ఎన్నికల వరకు గడ్డం వెంకటస్వామి(కాకా)కి వరుసగా టికెట్ ఇవ్వగా, 2014, 2019లో గడ్డం వివేక్‌కు ఇచ్చారని, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నూర్ నుంచి గడ్డం వివేక్‌కు, బెల్లంపల్లి నుంచి ఆయన సోదరుడు గడ్డం వినోద్ కుమార్‌కు టికెట్ ఇచ్చారని, ఈసారి ఎంపీ టిక్కెట్ మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారికి టికెట్ ఇవ్వాలని ఆ వర్గాలు పట్టుబడుతున్నాయి. ఆ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎంపీ డాక్టర్ పి సుగుణ కుమారి, ఊట్ల వరప్రసాద్, ఆసంపెల్లి శ్రీనివాస్, గజ్జెల కాంతం తదితరులు పోటీ పడుతున్నారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారికి టికెట్ ఇస్తే వీరిలో ఎవరికో ఒకరికి టికెట్ దక్కడం ఖాయం. బీఆర్ఎస్ పార్టీకి చెందిన సిట్టింగ్ ఎంపీ బొర్లకుంట వెంకటేశ్ నేత ఆ పార్టీని వీడి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. టికెట్ ఇస్తామనే హామీ దక్కిన తర్వాతనే ఆయన కాంగ్రెస్‌లో చేరారనే ప్రచారం జరుగుతున్నది. కాగా, నాగర్‌కర్నూల్, వరంగల్ టికెట్ల పైనే పెద్దపల్లి టిక్కెట్ ఏ సామాజిక వర్గానికి చెందిన నాయకుడికి దక్కనున్నదనే తేలనున్నది. మరో వారంరోజుల పాటు ఆశావహులకు ఉత్కంఠ తప్పేలా లేదు.

సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా గాజుల లక్ష్మి



చైర్‌పర్సన్ గాజుల లక్ష్మికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే విజయరమణరావు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 28: సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా గాజుల లక్ష్మిరాజమల్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పెద్దపల్లి ఆర్డీవో అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మున్సిపల్ పాలకవర్గం సమావేశంలో లక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇంతకు ముందు చైర్‌పర్సన్‌గా కొనసాగిన ముత్యం సునితపై అవిశ్వాసం ప్రకటించి పదిమంది కౌన్సిలర్లు ఓటింగ్‌లో పాల్గొని మద్దతు తెలుపడంతో సునిత పదవిని కోల్పోయారు. దాంతో చైర్‌పర్సన్ ఎన్నిక కోసం బుధవారం సమావేశాన్ని నిర్వహించాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్‌కు చెందిన కూకట్ల గోపి, గుర్రాల శ్రీనివాస్‌లు గాజుల లక్ష్మిని చైర్‌పర్సన్ కోసం ప్రతిపాదించారు. సమావేశంలో పాల్గొన్న పదిమంది కౌన్సిలర్లు ఆమోదించడంతో గాజుల లక్ష్మి చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఆర్డీవో ప్రకటించారు. బిరుదు సమతక్రిష్ణ వైస్‌చైర్‌పర్సన్‌గా కొనసాగుతారన్నారు. సమావేశంలో తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, కమిషనర్ వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

● ఎన్నికైన రెండుమూడు గంటల్లోనే..

సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన గాజుల లక్ష్మిరాజమల్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. చైర్‌పర్సన్‌గా ఎన్నికైన రెండుమూడు గంటల్లోనే ఎమ్మెల్యే విజయరమణారావు వీరికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. కౌన్సిల్‌లో మొత్తం పదిహేను మంది సభ్యులు ఉండగా, తొమ్మిది మంది బీఆర్ఎస్, ఆరుగురు కాంగ్రెస్ వారు ఉన్నారు. కాంగ్రెస్‌కు చెందిన సిద్ద తిరుపతి అనారోగ్య కారణాలతో మరణించగా, మిగిలిన 14 మందిలో పన్నెండు మంది కౌన్సిలర్లు ముత్యం సునితపై అవిశ్వాసం ప్రకటించడం అందులో బీఆర్ఎస్‌కు చెందిన వారే ఎక్కువగా ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌కు చెందిన వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమతక్రిష్ణ కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్‌కు చెందిన గొట్టం లక్ష్మి మల్లయ్య బీఆర్ఎస్‌లో చేరారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ సభ్యులు కలిసి చైర్‌పర్సన్‌గా గాజుల లక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రేపటి నుంచి గృహ జ్యోతి పథకం అమలు : ఎస్ఈ

పెద్దపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని విద్యుత్ వినియోగదారులకు తెల్ల రేషన్‌కార్డు ఉండి, అర్హులైన వారికి మార్చి ఒకటి నుంచి గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు జీరో బిల్ అందిస్తామని సూపరింటెండింగ్ ఇంజనీర్ బొంకూరి సుదర్శనం తెలిపారు. ఎవరైతే గృహ జ్యోతి పథకం పొందడానికి అర్హులైన వారు ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకోకుండా ఉంటే లేదా ప్రజా పాలన దరఖాస్తులో ఏవైనా వివరాలు సరైనవి లేక లబ్ధి పొందకపోయిన తమ పరిధిలోని ఎంపీడీవో, మునిసిపల్ కార్యాలయాల్లో విద్యుత్ కనెక్షన్ నంబర్, తెల్లరేషన్ కార్డుతో అనుసంధానమైన ఆధార్ కార్డుతో కలిపి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గృహజ్యోతి పథకం అర్హత కలిగిన విద్యుత్ వినియోగదారులందరు ఆందోళన చెందనవసరం లేదని, అర్హత కలిగిన వారికి సవరించి జీరో బిల్ అందచేయడం జరుగుతుందని తెలిపారు. ఒకవేళ దరఖాస్తు పెండింగులో ఉంటే దరఖాస్తు పరిశీలన అయ్యేవరకు విద్యుత్ సిబ్బంది బిల్ వసూలుపై ఎలాంటి చర్యలు తీసుకోరన్నారు.

త్వరలోనే మరో రెండు పథకాలు అమలు

- ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 28: ఆరు గ్యారంటీ స్కీములకు సంబంధించి మరో రెండు ముఖ్యమైన హామీలు త్వరలో అమలుచేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మండలంలోని అల్లీపూర్‌లో సీసీ రోడ్డు పనులకు బుధవారం ఎమ్మెల్యే విజయరమణారావు శంకుస్థాపన చేశారు. ఈజీఎస్ పథకం కింద సీసీరోడ్డుకు ఐదు లక్షలు మంజూరుకాగా వాటితో పనులు ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో ఐదు వందలకు గ్యాస్‌తోపాటు 200యూనిట్ల ఉచిత కరెంట్ పథకాలను ఈనెలలోనే అమలుచేసేందుకు ప్రభుత్వం అన్నిఏర్పాట్లు చేసిందన్నారు. అలాగే గ్రామంలో ఇంకా ఎన్ని సీసీరోడ్లు అవసరం ఉన్నాయో వాటి వివరాలు తెలుసుకుని అన్ని పనులు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మినుపాల ప్రకాష్ రావు, చిలుక సతీష్, దామోదర్‌రావు, రాజిరెడ్డి, కోదాటి కిరణ్, శనిగరం సదానందం, వడ్లకొండ చిన్న తిరుపతి రాకేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రామగుండం కమిషనరేట్‌లో పలువురు సీఐల బదిలీ

కోల్‌సిటీ, ఫిబ్రవరి 28: లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో రామగుండం కమిషనరేట్ పరిధిలో మూడేళ్ల సర్వీస్ పూర్తిచేసిన పలువురు సీఐలను బుధవారం బదిలీ చేస్తూ మల్టీజోన్-1 ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న ప్రమోద్‌రావును రామగుండం కమిషనరేట్ ఐటీ కోర్‌కు, రామగుండం టాస్క్‌ఫోర్స్-2లో పనిచేస్తున్న ఇంద్రసేనారెడ్డి గోదావరిఖని వన్‌టౌన్ సీఐగా, గోదావరిఖని టుటౌన్‌లో పని చేస్తున్న ప్రసాద్‌రావును కమిషనరేట్‌లోని లీగల్ సెల్‌కు, మల్టీజోన్ ఐజీ ఆఫీస్‌లో వెయింట్‌లో ఉన్న రవీందర్‌ను టుటౌన్ సీఐగా, రామగుండం సీఐ టీ ప్రవీణ్‌కుమార్‌ను మల్టీజోన్ ఐజీకి రిపోర్టు చేయాలని, నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్‌లో పని చేస్తున్న అజయ్‌బాబును రామగుండం సీఐగా, సుల్తానాబాద్ సీఐ జగదీష్‌ను ఐజీ కార్యాలయంలో రిపోర్టుచేయాలని, సుబ్బారెడ్డిని సుల్తానాబాద్ సీఐగా, సరెండర్‌లో ఉన్న ఎం వెంకటేశ్వర్లును మంథని సీఐగా, మంథని సీఐ రాజు గౌడ్‌ను రామగుండం కమిషనరేట్ సైబర్ క్రైమ్-2కు బదిలీ చేశారు. మందమర్రి సర్కిల్‌లో పనిచేస్తున్న రవిని, కమిషనరేట్‌లోని టాస్క్‌ఫోర్స్-1లో పనిచేస్తున్న రాజ్ కుమార్‌గౌడ్‌ను, తాండూర్‌లో కూచన శ్రీనివాసరావును ఐజీ ఆఫీస్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. సైబర్ క్రైమ్-2లో పని చేస్తున్న ఎంఎల్ఎం లింగయ్యను సైబర్ క్రైమ్-1కు బదిలీ చేశారు.

ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలు

- జిల్లావ్యాప్తంగా 94.44 శాతం విద్యార్థులు హాజరు
- గోదావరిఖనిలో పరీక్ష కేంద్రం దొరకక ఇబ్బందులు పడిన విద్యార్థులు



జిల్లా కేంద్రంలోని ఓ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్



ఖనిలోని ఓ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన రామగుండం సీపీ

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 28 : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. మొదటిరోజు జిల్లాలో 94.44 శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఈ పరీక్ష కేంద్రాలను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కల్పన పరిశీలించారు. జిల్లాలో బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు జరిగాయని, జనరల్, వొకేషనల్ కలిపి 5636 మంది పరీక్ష రాయాల్సిఉండగా, 5323మంది హాజరయ్యారు. జనరల్ అభ్యర్థులు 4464 మందికి 4253 మంది హాజరుకాగా, 211 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్ 1172మందికి 1070 మంది హాజరుకాగా, 102 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తంగా జిల్లాలో 94.44 శాతం హాజరయ్యారని, మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, ప్రశాంతంగా పరీక్ష జరిగిందని కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి మున్సిపాలిటీలో ఉన్న ఐదు పరీక్షా కేంద్రాలను జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కల్పన తనిఖీ చేశారు.

ధర్మారం, ఫిబ్రవరి 28: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. ధర్మారం మండల కేంద్రంలో ఆదర్శ కళాశాల పరీక్ష కేంద్రంలో 300మంది విద్యార్థులకు 290మంది హాజరు కాగా 10 మంది గైర్హాజయ్యారు. ప్రభుత్వజూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 344 మంది విద్యార్థులకు 336మంది హాజరు కాగా 8మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యంతో పాటు అత్యవసర వైద్య సిబ్బందిని నియమించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 28: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఉదయం 8గంటల వరకే పరీక్ష కేంద్రానికి చేరుకోగా విద్యార్థులను పోలీసులు, సెంటర్ నిర్వాహకులు తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. 9గంటలకు పరీక్ష ప్రారంభమై 12గంటలకు ముగిసింది. మొదటి సంవత్సరం విద్యార్థులు 180మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 143మంది పరీక్ష రాస్తున్నట్లు ప్రిన్సిపాల్ విశ్వప్రసాద్ తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని ఎస్ఐ ఓంకార్‌యాదవ్ పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందని వారు తెలిపారు. విద్యార్థులకు అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 28: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం గోదావరిఖనిలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ప్రథమ సంవత్సరం పరీక్షలు రామగుండం, ఎన్‌టీపీసీ, గోదావరిఖని ప్రాంతాల్లో మొత్తం ఏడు పరీక్షా కేంద్రాలలో 1816 మంది విద్యార్థులకు 1735 మంది హాజరు కాగా 81 మంది గైర్హజరయ్యారు. మొత్తం 95.53 శాతం నమోదయ్యింది. రామగుండంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎన్‌టీపీసీలో సచ్‌దేవ జూనియర్ కళాశాల, గోదావరిఖనిలో ప్రభుత్వ బాలుర కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, గాంధీ జూనియర్ కళాశాల, కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాల, కాకతీయ జూనియర్ కళాశాలలో విద్యార్థులు పరీక్షలు రాశారు.

పరీక్ష కేంద్రం దొరకక ఇబ్బంది పడిన విద్యార్థులు..

గోదావరిఖనిలో ఓ పరీక్ష దొరకక విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. కాకతీయ జూనియర్ కళాశాల యాజమాన్యం కళాశాలను పాత క్యాంపస్ నుంచి నూతన క్యాంపస్‌లోకి మార్చడం, పాత కాకతీయ కళాశాల పేరుతో ఉన్న మరో క్యాంపస్‌లో గాంధీ కళాశాలను పరీక్షా కేంద్రంగా కేటాయించడంతో విద్యార్థులు అయోమయానికి గురై ఇబ్బందులు పడ్డారు. అయితే ఈ విషయంపై జిల్లా నోడల్ అధికారిని కల్పనను వివరణ అడగగా తమ దృష్టి ఏమీ రాలేదని, ఆ విషయంగా ఆలస్యంగా వచ్చిన ఘటనలు సదరు పరీక్ష కేంద్రాల నుంచి లేవని తెలిపారు.

పరీక్షా కేంద్రాలను సందర్శించిన రామగుండం సీపీ

గోదావరిఖని ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ సందర్శించారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, శారదానగర్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాలను సందర్శించి పోలీసు బందోబస్త్, అభ్యర్థులకు అసౌకర్యం కలగకుండా పరీక్ష నిర్వహణకు అధికారులు తీసుకుంటున్న చర్యలను పర్యవేక్షణ చేసి సూచనలు ఇచ్చారు. పరీక్షా కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్స్ ఇంటర్ నెట్ సెంటర్లను మూసివేయాలని, కేంద్రాల వద్ద ప్రజలు గుమికూడి ఉండరాదని, ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించరాదని సీపీ తెలిపారు.

మంథని, ఫిబ్రవరి 28: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మంథనిలోని బాలికల జూనియర్ కళాశాలలో 201 మందికి 19 మంది, బాలుర కళాశాలలో 176 మందికి 36 మంది గైర్హాజరయ్యారు. ఒక్క నిమిషం నిబంధన అమలులో ఉండటంతో చాలా మంది విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. ఆలస్యంగా వచ్చిన వారిని అధికారులు పరీక్షకు అనుమతించలేదు. పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. కేంద్రాలను పోలీసు అధికారులు సందర్శించారు.

ముత్తారం, ఫిబ్రవరి 28: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలు ప్రారంభమయ్యాయి. మండలంలో ఆదర్శ పాఠశాల, కస్తూర్బా గాంధీ ఆశ్రమ పాఠశాలతో పాటు జూనియర్ కళాశాల విద్యార్థులు మొత్తం 199 మంది విద్యార్థులు ఉండగా 178 మంది విద్యార్థులు హాజరయ్యారు, 21 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కస్తూర్బాపాఠశాల నుంచి విద్యార్థులు పరీక్ష కేంద్రానికి బయలుదేరే ముందు వాగ్దేవి కళశాల యాజమన్యం పరీక్ష ప్యాడ్‌లను అందజేశారు.

కమాన్‌పూర్, ఫిబ్రవరి 28 : మండల కేంద్రంలో ఇంటర్ ప్రథమ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. ఈ సందర్భంగా గుండారంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 101 మంది విద్యార్థులకు గాను 99 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

జూలపల్లి, ఫిబ్రవరి 28 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్‌మీడియట్ మొదటి సంవత్సరం వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు నిర్వహించిన ఇంటర్ పరీక్షల్లో 264 మంది విద్యార్థులకు 12 మంది విద్యార్థులు హాజరు కాలేదని ప్రిన్సిపాల్ తెలిపారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత

కమాన్‌పూర్, ఫిబ్రవరి 28 : గ్రామాల్లో పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత సూచించారు. బుధవారం మండలంలోని గుండారం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులనుద్దేశించి మాట్లాడుతూ రాబోయే వర్షాకాలంలో గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మురుగు కాలువలను నిరంతరం శుభ్రం చేయించాలని, చెత్త, చెదారాన్ని వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం గ్రామంలోని ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తున్న కిరాణం షాపు యాజమానికి జరిమానా విధించారు. ఆమె వెంట మండల పంచాయతీ అధికారి శేషయ్య సూరి, పంచాయతీ కార్యదర్శి నరేష్‌లు ఉన్నారు.

ఓదెల వైస్‌ఎంపీపీగా తిరుపతి ఏకగ్రీవ ఎన్నిక

ఓదెల, ఫిబ్రవరి 28: మండల పరిషత్ వైస్ ఎంపీపీగా శానగొండ ఎంపీటీసీ జీల తిరుపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మూడేళ్ల క్రితం వైస్‌ఎంపీపీ పల్లె కుమార్ అనారోగ్యంతో మృతిచెందగా, అప్పటినుంచి ఎలాంటి ఎన్నిక నిర్వహించలేదు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రిసైడింగ్ అధికారి తిరుపతిరావు సమక్షంలో ఎన్నిక నిర్వహించారు. ఇందులో ఎంపీపీ ప్రతిపాదించగా నోముల పద్మవతి బలపరచడంతో జీల తిరుపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ప్రిసైడింగ్ అధికారి ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తిరుపతి, ఎంపీవో జావేద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఆరెల్లి సరోజన, మొండయ్య, రెడ్డి స్వరూప శ్రీనివాస్, ఐరెడ్డి సరోజన కిషన్‌రెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.

నీరుకుళ్ల సమ్మక్క జాతర ఆదాయం రూ.20 లక్షలు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 28: మండలంలోని నీరుకుళ్ల సమ్మక్క జాతర ఆదాయాన్ని బుధవారం శ్రీరంగనాయకుల స్వామివారి ఆలయంలో లెక్కించారు. అధికారులు, జాతర నిర్వాహణ కమిటీ, గ్రామస్తుల సమక్షంలో లెక్కింపు చేపట్టగా, ఇరవై లక్షల పదమూడు వేల 859రూపాయల ఆదాయం వచ్చింది. రెండు లక్షల అరవై ఒక్క వేయి 685రూపాయలు సేవా టిక్కెట్ల ద్వారా, 4లక్షల 88వేలు వేలం పాటల ద్వారా, 12లక్షల 64వేల 174రూపాయలు హుండీలద్వారా ఆదాయం సమకూరింది. మొత్తం ఆదాయం 20 లక్షల 13 వేల 859 రూపాయలుగా తేల్చారు.

పోలీస్ కార్యాలయాలను తనిఖీ చేసిన సీపీ

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 28: పెద్దపల్లి ఏసీపీ, సర్కిల్ కార్యాలయాలతో పాటు, పోలీస్ స్టేషన్ సీపీ ఎం శ్రీనివాస్ తనిఖీ చేశారు. నేర, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణ కోసం పెద్దపల్లి ఏసీపీ ఆఫీస్, సర్కిల్ ఆఫీస్, పోలీస్ స్టేషన్‌ను సీపీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీపీ పోలీస్ స్టేషన్ పరిసరాలతోపాటు రిసెప్షన్ సెంటర్, కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించి రికార్డులను, సీసీ కెమెరాల పని తీరును పరిశీలించారు. కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ రమేష్, సీఐ కృష్ణ, ఎస్ఐలు లక్ష్మణ్‌రావు, మల్లేష్‌తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీపీ

సుల్తానాబాద్, ఫిబ్రవరి 28: సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్‌ను బుధవారం రామగుండం కమిషనర్ ఎం శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీపీ శ్రీనివాస్ పలు రికార్డులు పరిశీలించారు. పోలీసుల విధులు నిర్వహణ, బందోబస్తు, పెట్రోలింగ్, నేరాలు, కేసులు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఏ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి, వాటిలో విచారణలు పూర్తయినవి ఎన్ని, ఇంకా ఎన్ని కేసులలో విచారణ దర్యాప్తులు పూర్తికావల్సి ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. సీపీ వెంట రామగుండం ఏసీపీ రమేష్, సీఐ జగదీష్ ఎస్ఐ అనిత ఉన్నారు.

పాలకుర్తి, ఫిబ్రవరి 28 : బసంత్‌నగర్ పోలిస్టేషన్‌ను బుధవారం రామగుండం సీపీ శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించాలని సూచించారు. సీపీ వెంట గోదావరిఖని ఏసీపీ రమేష్, సీఐ కృష్ణ, ఎస్ఐలు స్వామి, శివాణి తదితరులు ఉన్నారు.

పెద్దపల్లి డీఆర్‌డీవోగా రవీందర్

పెద్దపల్లి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి డీఆర్‌డీవోగా ఆర్ రవీందర్‌ను నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటీ సీఈవోగా పోస్టింగ్ కోసం వెయింటింగ్‌లో ఉన్న రవీందర్‌కు డీఆర్‌డీవోగా పూర్తి బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. డీఆర్‌డీవోగా పనిచేసిన వీ శ్రీధర్ కరీంనగర్‌కు బదిలీ కాగా అతని స్థానంలో ఆదిలాబాద్ నుంచి వచ్చిన అధికారి విధుల్లో చేరకపోవడంతో రవీందర్‌కు బాధ్యతలు అప్పగించారు.

పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిని కలిసిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, ఫిబ్రవరి 28: రామగుండం కార్పొరేషన్ అభివృద్ధి కోసం రూ.126కోట్లు కేటాయించిన పురపాలక పరిపాలన పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి దాన కిశోర్‌ను బుధవారం సచివాలయంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కలిశారు. కార్పొరేషన్ అభివృద్ధికి రూ.126కోట్లు కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, కార్యదర్శి దాన కిశోర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

WANTED GENERATOR

★ WANTED OLD GENERATOR 5H.P OR 7H.P IN RUNNING CONDITION CONTACT AFTER 1-00 P.M, CELL : 98490 52834

AJK-185620

CHANGE OF NAME

★ I, GOUISA BEGAM W/O. MOHAMMED GHOUSE KHAN R/O.H.NO. 10-4-508,SUBHASH NAGAR, KARIMNAGR. HAVE CHANGED MY NAME AS "GOUISA BEGUM W/O. MOHAMMED GHOUSE KHAN.

AJK-15017

WANTED

★ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని వంట పని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనము. జీతం: 20k. Ph: 8977639662, 8977639663

AJH-14152

3+2 స్కీం కలదు

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.

పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి

కరీంనగర్ :- సెల్ : 99854 10640
జగిత్యాల :- సెల్: 99854 11262
మెట్‌పల్లి :- సెల్: 70131 42966
వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063
పెద్దపల్లి :- 95509 00238

మధ్యవర్తిత్వం చేస్తూ డబ్బులు వసూలు చేసిన వ్యక్తి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 28: మధ్యవర్తిత్వం చేస్తూ డబ్బులు వసూలు చేసిన వ్యక్తిని అరెస్ట్ చేశామని సిరిసిల్ల డీఎస్పీ భీంశర్మ తెలిపారు. బుధవారం అయన మాట్లాడుతూ ముస్తాబాద్ మండలానికి చెందిన లకావత్ శ్రీరామ్ అనే వ్యక్తి ఓ బాలికను వేధించిన విషయంలో ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో 2019లో ఫోక్సో కేసు నమోదైంది. ఆ కేసు కోర్టులో పెండింగ్ ఉన్నందున, లకావత్ చిన్న మున్నా నాయక్ అనే వ్యక్తి కేసు రాజీపడేలా మాట్లాడి పంచాయతీ చేస్తానని అన్నాడన్నారు. ఇందుకు లకావత్ శ్రీరామ్‌ను రూ. 1.80 లక్షలు డబ్బుల ఇవ్వాలని, డబ్బులు ఇస్తే కేసు రాజీ చేస్తానని డిమాండ్ చేసాడన్నారు. అతని డిమాండ్ మేరకు రూ 1.80 లక్షలు లకావత్ చిన్న మున్నా నాయక్ అనే వ్యక్తికి ఇచ్చాడన్నారు. ఆ డబ్బులు తీసుకొని పంచాయతీ చేయలేదని లకావత్ శ్రీరామ్ లకావత్ చిన్న మున్నాపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి చిన్నమున్నానాయక్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

భూకబ్జా కేసుల్లో మరో ఐదుగురిపై కేసు

● పలువురు కార్పొరేటర్ల భర్తలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 28: భూవివాదాలు సృష్టించి అక్రమంగా భూమి యజమానుల వద్ద నుంచి డబ్బులు దోపిడీకి పాల్పడటమే కాకుండా నిర్మాణాల కూల్చివేతకు పాల్పడిన ఐదుగురు నిందితులపై కరీంనగర్ రూరల్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. బుధవారం కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కార్పొరేటర్ల భర్తలు ఎడ్ల అశోక్, తుల బాలయ్య, కాశెట్టి శ్రీనివాస్‌లను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచామని, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. కరీంనగర్ వివేకానందపురి కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మామిడి రవీందర్‌రెడ్డి తీగలగుట్టపల్లిలోని సర్వే నెంబరు 240ఏలో 744.97 చ.గ. స్థలాన్ని 2004 సంవత్సరంలో గోపడి సుగుణమ్మ, గోపడి రాజుల వద్ద కొనుగోలు చేశాడు. 2017లో గ్రామపంచాయతీ అనుమతితో ప్రహరీ, షెడ్ నిర్మించుకున్నాడు. ఇదే సర్వే నంబరులోని మూల అరుణాదేవి 26 ప్లాట్లు ఇంటిస్థలాలను విక్రయించగా వివిధ ప్రాంతాలకు చెందినవారు కొనుగోలు చేశారు. అయితే ఒక్కో ఇంటి స్థలం నుంచి 3 లక్షల రూపాయల వంతున ఇవ్వాలని రవీందర్‌రెడ్డిని కార్పొరేటర్ భర్త కాశెట్టి శ్రీనివాస్ బెదిరించాడు. అడిగిన డబ్బులు ఇవ్వనందున వారి ప్లాట్లకు వెళ్లే 40 అడుగుల రోడ్డు ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ అక్కడ శ్మశానవాటికగా స్థానికులను ప్రోత్సహించి అక్కడే శవాలను ఖననం చేయిస్తున్నారు. 2019జనవరి 2న కార్పొరేటర్ భర్త ఎడ్ల అశోక్, మాజీ వార్డు సభ్యుడు అల్లిబిల్లి నగేష్‌తో కలిసి రవీందర్‌రెడ్డి నిర్మించిన ప్రహరీ, షెడ్, గేట్‌లను ఎక్స్‌కావేటర్‌తో కూల్చివేయించారు.

కార్పొరేటర్ల భర్తలైన ఎడ్ల అశోక్, కాశెట్టి శ్రీనివాస్, తుల బాలయ్యలు రవీందర్‌రెడ్డిని పిలిపించి అక్కడి ప్లాట్ల యజమానులు ఒక్కొక్కరు రూ. 3 లక్షలు ఇవ్వాలని లేదంటే అక్కడే శ్మశానవాటికను నిర్మిస్తామని బెదిరించారు. దీంతో రవీందర్‌రెడ్డితో పాటు రాజమౌళి, రఘుపతిరెడ్డి తలా లక్ష రూపాయలు ఎడ్ల అశోక్‌కు ముట్టజెప్పారు. మిగతావారు డబ్బులు ఇవ్వలేదని 2020లో శివరాత్రి సమ్మయ్య ద్వారా ఎక్స్‌కావేటర్‌తో రోడ్డుపై గుంతలు తీయించారు. దీనిపై బాధితుల ఫిర్యాదుతో కరీంనగర్ రూరల్ ఠాణాలో ఐపీసీ సెక్షన్ 386, 452, 457, 506, 120-బి రెడ్‌విత్ 34 కింద నిందితులు ఐదుగురిపై బుధవారం కేసు నమోదు చేశారు. నిందితులు కార్పొరేటర్ల భర్తలు ఎడ్ల అశోక్, తుల బాలయ్య, కాశెట్టి శ్రీనివాస్‌లను అరెస్టు చేసి కరీంనగర్ ఇన్‌చార్జి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా ప్రస్తుతానికి వారికి 41ఏ సీఆర్‌పీసీ కింద నోటీసులు ఇవ్వాలని న్యాయమూర్తి సూచించినట్లు పోలీసులు తెలిపారు.

రేపే బ్రహ్మాండమైన విడుదల


సుదర్శన్ 35 ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
8.00,11.15,2.30,6.00,9.30
దేవి 70ఎంఎం - ఆర్.టి.సి.క్రాస్ రోడ్స్ 8.00,11.15,2.30,6.00

రేపే బ్రహ్మాండమైన విడుదల

MOST TERRIFIC MYSTERY EVER MADE
WORLDWIDE THEATRICAL RELEASE BY DM UNIVERSAL STUDIOS
శాంతి 70ఎంఎం - నారాయణగూడ 11.00,6.00
మహాలక్ష్మి 70 ఎంఎం - కొత్తపేట 11.15,6.15
DM UNIVERSAL STUDIOS THRO 9030161717

రేపే బ్రహ్మాండమైన విడుదల

సంధ్య 70 ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
MYTHRI MOVIE DISTRIBUTORS LLP

A NEW ERA BLOCKBUSTER నేడే చూడండి

సప్తగిరి 70 ఎంఎం - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
11.00,2.00,6.00,9.00

మార్చి 2న బ్రహ్మాండమైన విడుదల

దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
8.00,11.15,2.30,6.00,9.30
భ్రమరాంబ 70 ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి

రేపే బ్రహ్మాండమైన విడుదల


సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 10.50am
జిఎస్ఎమ్ - మదీనగూడ 11.30am
నెక్సెస్ సత్వ - కావాడిగూడ 2.00pm
NTR CINEMAS 9030161717

రేపే బ్రహ్మాండమైన విడుదల

ONE MEDIA 7799090708

మార్చి 2న బ్రహ్మాండమైన విడుదల

సుదర్శన్ 35 ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.30,6.00,9.30
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound


IN CINEMAS TOMORROW
AMB CINEMAS GACHHIBOWLI
PRASADS MULTIPLEX NTR GARDENS
SUJANA FORUM PRISTAGE MALL - KPHB | CENTRAL MALL - PANJAGUTTA | GVK ONE - BANJARA HILLS | GSM MALL - MIYAPUR | SATTVA NECKLACE MALL - KAVADIGUDA |
MANTRA MALL - ATTAPUR

విజయవంతమైన 3వ వారం




శాంతి 70 ఎంఎం - నారాయణగూడ
11.00,2.00,6.00,9.00

GLOBAL CINEMAS LLP



దేవి 70 ఎంఎం - ఆర్‌టీసీ క్రాస్ రోడ్స్ 11.00,2.30,6.00,9.30
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

SRI VIJAYA FILMS



సుదర్శన్ 35 ఎంఎం - ఆర్‌టీసీ క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.15,6.00,9.15

మహా శివరాత్రి జాతర ఘనంగా నిర్వహించాలి

● రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ● వేములవాడలో జాతర ఏర్పాట్లపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్



ఆలయ పరిసరాలు పరిశీలిస్తున్న మంత్రి పొన్నం, విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, ఫిబ్రవరి 28: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో మార్చి 7,8,9వ తేదీలలో జరుగనున్న మహాశివరాత్రి జాతర ఉత్సవాలను ఆధ్యాత్మిక శోభతో ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. వేములవాడలో బుధవారం నిర్వహించిన మహాశివరాత్రి జాతర సమన్వయ సమావేశంలో ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మహా శివరాత్రి జాతర ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా జాతర నిర్వహించాల్సి ఉంటుందని, నిర్దేశించుకున్న పనులను జాతర ప్రారంభానికి ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. పూజలలో ఎలాంటి లోపాలు ఉండకుండా చూడాలని, శాస్త్రపరంగా స్వామి వారి పూజలు ఘనంగా జరగాలని, భక్తులకు త్వరగా దర్శనం లభించే విధంగా చర్యలు తీసుకోవాలని, జాతర నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని సూచించారు. జాతర సందర్భంగా మార్చి 7 నుంచి మార్చి 9 వరకు వేములవాడకు ఎక్కువ బస్సు సర్వీసులు నడపాలని, మహాలక్ష్మి పథకం నేపథ్యంలో మహిళలకు ఉచిత ప్రయాణం ఉన్నందున అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని, భక్తుల రద్దీ ఆధారంగా ఆర్టీసీ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ అవసరమైన మార్గాలలో అదనపు సర్వీసులు నడపాలని సూచించారు. అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాలు, పొలాలలో రైతుల సహకారంతో పార్కింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. రోడ్ల పక్కన ఉన్న బావులకు ఫెన్సింగ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆలయ పరిసరాలలో అపరిశుభ్రత కనిపించకుండా మూడు షిఫ్ట్‌లలో పారిశుధ్య సిబ్బంది విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, భక్తుల కోసం ఎక్కడికక్కడ హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు.

ప్రత్యేక దర్శనానికి రూ.300 రుసుం

మహాశివరాత్రి జాతర సందర్భంగా గతంలో అందించే ప్రత్యేక పాసులను పూర్తిస్థాయిలో రద్దు చేస్తున్నామని, వాటి స్థానంలో ప్రత్యేక దర్శనానికి రూ.300 టికెట్ ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. జాతర అనంతరం వేములవాడ క్షేత్రాన్ని శ్రీశైలం తరహాలో అభివృద్ధి చేసే విధంగా ప్రణాళికబద్ధంగా ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. వేములవాడలో సైతం బ్రేక్ దర్శనం అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. దాతల సహాయంతో భక్తుల కోసం 500 గదులతో అతిథి గృహాలను నిర్మించేందుకు ప్రణాళిక రూపొం దించాలని, దాతలకు కల్పించే సదుపాయాల అంశంలో శ్రీశైలం, తిరుపతిలో అవలంబించే విధానాలను అవలంబించాలని మంత్రి పేర్కొన్నారు. ఆలయ నిత్య అన్నదాన సత్రంలో సంఖ్యతో సంబంధం లేకుండా ఎంత మంది భక్తులు వచ్చినా ప్రతినిత్యం అన్నదానం చేయడానికి వీలుగా ఏర్పాట్లు చేయాలని ఇందుకోసం అవసరమైన నివేదిక రూపొందించాలని మంత్రి సూచించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేసే మహాశివరాత్రి జాతరను విజయవంతంగా చేయాలని, ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడే విధంగా వేములవాడ పట్టణాన్ని సన్నద్ధం చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ మంత్రి, ప్రభుత్వ విప్ అందించిన సూచనలు పాటిస్తూ అధికారులు వివిధ శాఖల మధ్య ఉన్న చిన్న సమన్వయ లోపాలను పరిష్కరిం చుకొని పకడ్బందీగా జాతర నిర్వహించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. సమావేశం అనంతరం ఆలయ పరిసరాలు, జాతర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీఎస్పీ నాగేంద్ర చారి, ఆలయ ఈఓ కృష్ణప్రసాద్, ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ సీడీపీవో, ఇన్‌చార్జి సీడీపీవోలపై వేటు

మంథని, ఫిబ్రవరి 28: అక్రమాల ఆరోపణలు, ఫిర్యాదులు, విధుల దుర్వినియోగానికి పాల్పడిన మంథని ఐసీడీఎస్ సీడీపీవో, ఇన్‌చార్జి సీడీపీవోతో పాటు మరో సూపర్‌వైజర్‌పై జిల్లా కలెక్టర్ ముజమిల్‌ఖాన్ వేటు వేశారు. మంథని సీడీపీవోగా విధులు నిర్వహిస్తున్న పద్మశ్రీ, ప్రస్తుతం ఇన్‌చార్జి సీడీపీవో, రామగిరి సెక్టార్ సూపర్‌వైజర్ బండ రజితలను రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు సరెండర్ చేస్తూ జిల్లా కలెక్టర్ ముజమిల్‌ఖాన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సుదీర్ఘ కాలంగా విధులు నిర్వహిస్తున్న మంథని ఐసీడీఎస్ సీడీపీవో పద్మశ్రీపై పలు ఆరోపణలు, ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వీటిపై స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో ఈ నెల 22వ తేదీన డీడబ్ల్యూవో, 26వ తేదీన వరంగల్ ఆర్‌డీజేలు విచారణ నిర్వహించారు. విచారణ అనంతరం పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్‌తో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులకు సమర్పించారు. ఈ మేరకు మంథని ఐసీడీఎస్ సీడీపీవో పద్మశ్రీ విధులు సరిగా నిర్వహించలేదని, ఇన్‌చార్జి సీడీపీవో, రామగిరి సెక్టార్ సూపర్‌వైజర్ బండ రజితలు తమ విధులు సక్రమంగా నిర్వహించడం లేదని, కార్యాలయ సమాచారాన్ని బయట పరిచిందని పేర్కొంటూ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు సరెండర్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గుంజపడుగు సెక్టార్ సూపర్ వైజర్‌గా విధులు నిర్వహి స్తున్న గండు సరిత ఇన్‌చార్జి సీడీపీవోకు సహకరించిందని పేర్కొంటూ షోకాజ్ నోటీసు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఐసీడీఎస్ ఆఫీసులో కొనసాగుతున్న ఫిర్యాదులు, విచారణలకు తాత్కాలికంగా బ్రేక్ పడే అవకాశం ఉంది.

సంఘ బహిష్కరణపై కేసు

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 28 : పట్టణంలోని మోచి సంఘం రెండు వర్గాలుగా విడిపోయి ఒక వర్గానికి చెందిన మోచి సంఘ కుల పెద్దమనుషులు మరో వర్గానికి చెందిన కుల సభ్యులను సామూహిక సంఘ బహిష్కరణ చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఉమ్మడిగా ఉన్న ఆస్తులను కులానికి చెందిన కొందరు ఆస్తులన్నీ తమవేనని ప్రచారం చేస్తూ మరో వర్గానికి సంఘం నుంచి బహిష్కరించినట్లు ప్రచారం చేస్తూ సంఘం ఆస్తుల్లో భాగస్వామ్యం లేదంటున్నారని సంఘానికి చెందిన కావల్ల పెంటయ్య తండ్రి లింగయ్య, ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో వృద్ధుడి ఆత్మహత్య

కొడిమ్యాల, ఫిబ్రవరి 28: మండలంలోని నమిలికొండ గ్రామానికి చెందిన బొలుమాల దేవయ్య(61)బుధవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు దేవయ్య అనారోగ్యంతో పాటు అప్పుల బాధలు భరించలేక వెటర్నరీ సెంటర్‌లోని చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుని కుమారుడు బొలుమాల సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కత్తితో తండ్రిపై దాడి

మెట్‌పల్లి, ఫిబ్రవరి 28: మెట్‌పల్లి అనుబంధ గ్రామమైన ఆరపేటలో కుటుంబ కలహాలతో తండ్రిపై కత్తితో దాడి చేసిన తనయుడి సంఘటన బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... ఆరపేట గ్రామానికి చెందిన రిత్వం కుమారుడు అయిన అక్బర్‌ఖాన్ కొంత కాలం వివాహం చేసుకున్న తర్వాత వేరు కాపురం పెట్టుకొని ఉంటున్నారు. కొన్ని రోజుల నుంచి అక్బర్ ఖాన్‌కు భార్యతో మనస్పర్థలు రావడంతో ఆమె తల్లిదండ్రుల వద్ద వెళ్లి ఉంటోంది. అప్పటి నుంచి తాగుడుకు బానిసై నా భార్య నాకు కావాలని అక్బర్‌ఖాన్ బుధవారం తల్లిదండ్రులపై గొడవకు దిగి తల్లిని కత్తితో పొడిచే క్రమంలో తండ్రి రిజ్వాన్‌ఖాన్ అడ్డుగా వచ్చాడు. అడ్డుగా వచ్చిన రిజ్వాన్‌పై దాడికి పాల్పడటంతో గాయపడిన రిజ్వాన్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రిజ్వాన్‌ఖాన్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అక్బర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వలస కూలి ఆత్మహత్య

మల్లాపూర్, ఫిబ్రవరి, 28: గత తొమ్మిదేళ్ల క్రితం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి జీవనోపాధి నిమిత్తం మండలంలోని రత్నపూర్ గ్రామానికి వచ్చిన పెడికం వెంకటేష్(38) అనే వలస కూలి తాగుడుకు బానిసై జీవితంపై విరక్తి చెంది బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు బుధవారం మల్లాపూర్ పోలీసులు తెలిపారు. మృతుడి భార్య పెడికం గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు.

రాముడి జన్మస్థలం గురించి మాట్లాడినట్లు నిరూపిస్తారా?

● బండి సంజయ్ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డ మంత్రి పొన్నం

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 28: రాముని జన్మస్థలం ఎక్కడ, రాముని అక్షింతలు ఎక్కడివి అని తాను మాట్లాడినట్లు ఎంపీ బండి సంజయ్ ప్రచారం చేస్తున్నాడని వాటిని సాక్ష్యాలతో నిరూపిస్తే సజీవ దహనానికి కూడా సిద్ధమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి శ్రీలక్ష్మీనర్సింహాస్వామి వారి దర్శనానికి విచ్చేసిన ఆయనకు రాజన్న ఆలయ ఈవో కృష్ణప్రసాద్ పూర్ణాహుతితో స్వాగతం పలికారు. అనంతరం శ్రీ లక్ష్మీనర్సింహాస్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొన్న ఆయనకు ఆలయ అర్చకులు రామాచారి, విజయేంద్ర చారీలు ఆశీర్వచనం గావించగా ఆలయాధికారులు శ్రీస్వామి వారి శేషవస్త్రాన్ని కప్పి ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం విలేకర్లతో పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హుస్నాబాద్‌ర్యాలీలో భాగంగా బండి సంజయ్‌కుమార్ రాముడు జన్మస్థలం ఎక్కడని, రాముని అక్షింతలు ఎక్కడివని అసలు ఈ ఎమ్మెల్యే తన అమ్మకే పుట్టాడా.. అని తన అమ్మను ఉద్దేశించి మాట్లాడిన తీరుపై విరుచు కుపడ్డారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వున్న తల్లులను, బీజేపీ పార్టీ అధిష్టానాన్ని ఒక్కటే కోరుతున్నానని, బండి సంజయ్ అన్న మాటలకు నా తల్లి రోదిస్తుందని భావోద్వేగానికి లోనయ్యారు. బిడ్డా నా తల్లి గురించి మాట్లాడావు జాగ్రత్త అని హెచ్చరించారు. ఆవేదనతో చెబుతున్న రాత్రంతా నిద్రపోలేదని అన్నారు. మళ్లీ పేపర్లలో, వాట్సప్‌లలో అమ్మ పేరుతో రాజకీయం చేస్తున్నావని నన్నే అంటున్నాడు. నేను నీలాగే రాజకీయాలు చేస్తున్నాను నాకు స్థానిక మాజీ ఎమ్మెల్యే రమేష్‌బాబుతో నాకు రాజకీయంగా శత్రుత్వం ఉంది, కానీ ఏ రోజు కూడా వాళ్ల కుటుంబ సభ్యుల గురించి మాట్లాడలేదని గుర్తు చేశారు. నేను ఒక హిందువునని, నేను భక్తుడినని, నేను మాత్రం బండి సంజయ్‌లాగా మాంసాహారం తినను అని ఎద్దేవా చేశారు. రాముడి జన్మస్థలం ఎక్కడ అని ప్రచారం చేస్తున్నారు. రాముని జన్మస్థలం గురించి అడిగే మూర్ఖుడు ఉంటాడా అని ప్రశ్నించారు. ఒకవేల నేను అని ఉంటే మీడియా చూస్తూ ఊరుకుంటుందా.. అని గుర్తు చేశారు. రామున్ని ఓట్ల రూపకంలో వాడుకుంటుంది మీరని, రాముని అంశంతో రాజకీయం చేస్తున్న మూర్ఖులు మీరని మండిపడ్డారు. ఎంపీగా చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు చెప్పాలన్నారు. రోడ్లు, ఉపాధి హామీ పనులు తప్ప నిర్మాణాత్మక పనులు ఏమి చేశావో చెప్పాలన్నారు. హిందువునని చెప్పుకునే నీవు ఎంపీగా వేములవాడ క్షేత్రానికి ఏమి చేశావని నిలదీశారు. రాముని పేరుతో రాజకీయం చేసుడు, మత పరమైన అంశాలను రెచ్చగొట్టడమే పనిగా పెట్టుకుని పబ్బం గడుపుతున్నావని విమర్శించారు. గత ఎంపీ ఎన్నికల సమయంలో నేను కూడా హిందువునే, నేను యజ్ఞాలు చేస్తాను, నేను భక్తున్నే వాడేవడు, వీడేవడు, ఈ హిందుగాళ్లు.. బొందుగాళ్లు అని కేసీఆర్ అన్న మాటలను సాకుగా చూపి ఎంపీగా గెలిచావని ఆరోపించారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న నువ్వు కరీంనగర్ ఎమ్మెల్యేగా మూడుసార్లు ఓడిపోయిన నువ్వు నన్ను రాజీనామా చేయమంటావా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గంగుల కమలాకర్‌తో కుమ్మక్కై కావాలని ఎమ్మెల్యేగా ఓడిపోయి మళ్లీ వాడో వీడో అంటూ నోటికి వచ్చిన మాటలు మాట్లాడి సానుభూతి తెచ్చుకోవాలని చూసే నీ రాజకీయ రంగు ప్రజలు గ్రహిస్తున్నారని పేర్కొన్నారు. భార్య మంగళసూత్రం విలువ తెలువని నువ్వు నా గురించి మాట్లాడుతావా అంటూ మండిపడ్డారు. వారి వెంట ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్, డీఎస్పీ నాగేంద్రచారి, తహసీల్దార్ మహేష్‌కుమార్ స్థానిక నాయకులు ఉన్నారు.



కొడుముంజలో ఎల్లమ్మ ఆలయ నిర్మాణ భూమిపూజ చేస్తున్న మంత్రి పొన్నం

ఆలయాల నిర్మాణానికి భూమి పూజ

వేములవాడ మండలం కొడుముంజ గ్రామంలోని ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా వెళ్లిన పొన్నం ప్రభాకర్ ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాజీ సర్పంచ్‌లు కదిరే రాజ్‌కుమార్, పండుగ ప్రదీప్, నాయకులు పిల్లి కనుకయ్య, ఎర్రం రాజు, చింతపల్లి శ్రీనివాస్‌రావు తదితరులు ఉన్నారు.

పని కల్పించాలని రోడ్డెక్కిన పవర్‌లూం నేత కార్మికులు



సిరిసిల్లలో పవర్‌లూం కార్మికుల ర్యాలీ

సిరిసిల్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నేతన్నలకు పని కల్పించాలని, సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారించాలని, ప్రభుత్వ అర్డర్లు తక్షణమే ఇవ్వాలంటూ సిరిసిల్ల నేత కార్మికులు రోడ్డెక్కారు. బుధవారం సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి సీఐటీయూ, పవర్‌లూం వర్కర్స్ యూనియన్ అసాముల సమన్వయ కమిటీ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ, మహాధర్నా నిర్వహించారు. చేనేత విగ్రహానికి పూలమాల వేసి అంబేద్కర్ చౌరస్తాకు చేరుకొని మానవహారంగా ఏర్పడ్డారు. ధర్నా నిర్వహించి ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర సంక్షోభాన్ని నివారించడంతో పాటు తక్షణమే బతుకమ్మ చీరలు, ప్రభుత్వ అర్డర్లు ఇవ్వాలని పెండింగ్ బకాయిలను సబ్సిడీ డబ్బులు, విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్‌లు మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందని అన్నారు. ఉపాధి లేక పవర్‌లూం కార్మికులు, అసాములు వైపని, వార్పిన్ కార్మికులు, గుమస్తాలు, జాపర్లు, అనుబంధ రంగాల కార్మికులు రోడ్డున పడ్డారని అన్నారు. గత ప్రభుత్వం బతుకమ్మ చీరలను ఉత్పత్తి చేయించిందని వాటికి సంబంధించిన బకాయిలు, యారన్ సబ్సిడీ బకాయిలు చెల్లించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా టెస్కోకు చెల్లించాల్సిన రూ 482 కోట్లు చెల్లించలేదన్నారు. సిరిసిల్లకు రూ.200 కోట్లు బకాయిలు వెంటనే విడుదల చేయాలని అన్నారు. ప్రతిపక్ష హోదాలో ఉన్న సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పోరాటాలకు కలిసి రావాలన్నారు. బీజేపీ ఎంపీ బండి సంజయ్ కార్మికుల కోసం పార్లమెంట్‌లో ఒక్కసారైనా నోరు మెదపలేదని అన్నారు. పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, అసాముల సంఘం అధ్యక్షుడు సిరిసిల్ల రవి తదితరులున్నారు.

అర్హులందరికీ గృహజ్యోతి : ఎస్ఈ

గణేష్‌నగర్, ఫిబ్రవరి 28: ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు గృహజ్యోతి పథకం వర్తిస్తుందని ఎస్ఈ గంగాధర్ తెలిపారు. లబ్ధిదారులు ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో విద్యుత్ కనెక్షన్ నెంబర్, తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డుతో కలిపి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన వారు ఆందోళన చెందవద్దని, అధికారులకు సమర్పించిన దరఖాస్తులు ధ్రువీకరించిన తర్వాత నమోదు చేస్తారన్నారు. అర్హులైన వారందరికీ జీరో బిల్ అందజేస్తామన్నారు. దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే పరిశీలన అయ్యేంత వరకు విద్యుత్ సిబ్బంది బిల్లు వసూలుపై చర్యలు తీసుకోరన్నారు.

భూ కబ్జాలకు పాల్పడిన వ్యక్తి అరెస్టు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 28: భూ కబ్జాలకు పాల్పడిన తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన పెద్దూరు తిరుపతి అనే వ్యక్తిని బుధవారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. 1996లో తంగళ్లపల్లి మండలానికి చెందిన గజభింకర్ రాధాభాయి 1996లో 20గుంటల భూమిని కొని రిజిస్ట్రేషన్ చేసుకుందన్నారు. ఈ భూమిని పెద్దూరు తిరుపతి అనే వ్యక్తి బెదిరించి ఆక్రమించుకున్నాడన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు తిరుపతిపై తంగళ్లపల్లి పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారని తెలిపారు. అమాయక ప్రజలను బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తూ కబ్జాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు.

ఉద్యోగాల పేరిట రూ. 9 లక్షల టోకరా

- ఇద్దరిపై కేసు నమోదు

గంభీరావుపేట, ఫిబ్రవరి 28: అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరిట నిరుద్యోగ యువకుల నుంచి గంభీరావుపేట మండలంలో ఇద్దరు వ్యక్తులు రూ.9 లక్షలు వసూలు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఎర్రవల్లికి చెందిన అర్జున్, గర్జనపల్లికి చెందిన రాజు అనే ఇద్దరు వ్యక్తులు పలు ప్రాంతాల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరిటా ఏడుగురు యువకుల నుంచి రూ.9 లక్షల వరకు వసూలు చేశారు. డబ్బులు ఇచ్చి నెలలు గడుస్తున్నా ఎలాంటి ఉద్యోగాలు రాకపోవడంతో అనుమానం వచ్చిన బాధితులు వారి ధరిని నిలదీశారు. గంభీరావుపేట మండలంలోని జగదాం బతండాకు చెందిన అజ్మీరా రమేష్ స్థానిక పోలీస్‌లను ఆశ్రయించాడు. రమేష్ ఫిర్యాదు మేరకు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ఏడుగురు యువకుల వద్ద ఉద్యోగాల పేరుతో రూ. 9 లక్షలు వసూలు చేసినట్లు రాజు, అర్జున్‌లు ఒప్పుకున్నారు. బాధితుడు రమేష్ ఫిర్యాదు మేరకు రాజు, అర్జున్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాంమోహన్ తెలిపారు. ఉద్యోగాల పేరిట నిరుద్యోగ యువకులు ఎవరైనా డబ్బులు అడిగితే తమ దృష్టికి తేవాలని ఎస్ఐ రాంమోహన్ వెల్లడించారు.

కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్రలను తిప్పి కొట్టాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్

సిరిసిల్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పన్నుతున్న కుట్రలను తిప్పికొట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు ప్రచురించిన కరపత్రాన్ని బుధవారం గంభీరావుపేట మండలం మల్లుపల్లెలో కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్ల కోసం కాంగ్రెస్ కాళేశ్వరం ప్రాజెక్టును కూల్చే కుట్ర పన్నుతోందన్నారు. మేడిగడ్డలో కుంగిన మూడు పిల్లర్లకు మరమ్మతు చేసి ప్రాజెక్టును పునరుద్ధరణ చేపట్టాల్సిన ప్రభుత్వం అసత్య ఆరోపణలతో బీఆర్ఎస్‌ను బదనాం చేసే కుట్ర పన్నుతోందన్నారు. ప్రపంచంలోనే నంబర్ వన్ ప్రాజెక్టుగా పేరుగాంచిన కాళేశ్వరం ప్రాజెక్టులో ఏర్పడిన చిన్న చిన్న సాంకేతిక లోపాలను భూతద్ధంలో చూపిస్తూ ప్రాజెక్ట్ ప్రతిష్ఠను మంటగలుపుతోందన్నారు. ఓట్ల కోసం రైతుల నోట్లో మట్టి కొట్టే పనులు మానుకోవాలని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై నిజానిజాలను ప్రజలకు వివరించేందుకు మార్చి 1న చలో కాళేశ్వరం కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. పెద్దపల్లి జడ్పీ చైర్మన్ మధుకర్ కాళేశ్వరం ప్రాజెక్టుపై రూపొందించిన కరపత్రాన్ని చదివితే పూర్తిగా అర్థమవుతుందన్నారు.కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ గల్ఫ్ ఏజెంట్ అరెస్టు

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 28: వేములవాడ మున్సిపల్ పరిధిలోని కోనాయపల్లి గ్రామంలో గల్ఫ్ దేశాలకు పంపిస్తానని మోసం చేస్తున్న వ్యక్తిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్ వెల్లడించారు. బోయినపల్లి మండల కేంద్రానికి చెందిన పెగ్గెర్ల చంద్రశేఖర్ కోనాయపల్లి గ్రామంలో కార్యలయం ఏర్పాటు చేసుకుని అమాయకులను మోసం చేస్తున్నాడని తెలిపారు. కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన మల్యాల దర్గయ్య అనే వ్యక్తిని ఉపాధి నిమిత్తం ఉక్రెయిన్‌కు పంపిస్తానని, నెలకు లక్ష జీతం వస్తుందని నమ్మించి రూ.2 లక్షల 75 వేలు తీసుకుని, మోసం చేసినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆలయానికి రూ.20 వేల విరాళం

మంథని, ఫిబ్రవరి 28: మున్సిపాలిటీ పరిధిలోని బోయిని పేట శ్రీనాగులమ్మ ఆలయానికి రూ.20వేలను అమిత్-కరిష్మాలు ఆలయ కమిటీకి బుధవారం అందజేశారు. ఈసందర్భంగా వారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాత కుటుంబాన్ని ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సన్మానించారు. ఈకార్యక్రమంలో పోతరవేన క్రాంతికుమార్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'కాకా' స్మారక క్రికెట్ పోటీలు

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 28: కాకా వెంకటస్వామి స్మారక క్రికెట్ పోటీలు రెండురోజులుగా కాలనీలోని అబ్దుల్ కలాం స్టేడియంలో జరుగుతున్నాయి. రామగుండం నియోజకవర్గస్థాయి పోటీల్లో పలు జట్లు పాల్గొన్నారు. బుధవారం ఉదయం గోదావరిఖని, పాలకుర్తి జట్ల మధ్య జరిగిన పోటీలో గోదావరిఖని జట్టు గెలిచింది. సాయంత్రం రామగుండం, యైటింక్లయిన్ కాలనీ జట్ల మధ్య జరిగిన పోటీలో కాలనీ జట్టు విజయం సాధించింది.

కమిషనర్‌ను కలిసిన ఉద్యోగులు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 28: తమ సమస్యల సాధన కోసం రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ అనితరామచంద్రన్‌ను బుధవారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేసినట్లు పంచాయతీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జొన్నకోటి వెంకటేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న వివిధ కేటగిరీల ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరించామన్నారు. స్పందించిన కమిషనర్ మూడు రోజులలో ప్రిన్సిపల్ సెక్రటరీతో మాట్లాడి న్యాయమైన డిమాండ్లను పరిశీలించి వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. తన తోపాటు రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల నరసింహులు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసాచారి, కోశాధికారి రవి, నాగరాజు తదితరులు ఉన్నారని వెంకటేశ్ తెలిపారు.

బిరుదు కుటుంబానికి పరామర్శ

సుల్తానాబాద్, ఫిబ్రవరి 28: మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు కుటుంబాన్ని బుధవారం రాష్ట్ర ప్రభుత్వ న్యాయశాఖ కార్యదర్శి రేండ్ల తిరుపతి పరామర్శించారు. స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముస్త్యాల రవిందర్, అమిరిశెట్టి తిరుపతి పాల్గొన్నారు.

ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

పెద్దపల్లిటౌన్, పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 27: పెద్దకల్వల క్యాంపులోకి శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో బుధవారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు పాల్గొన్నారు. ఆలయ కమిటీసభ్యులు, టీఎస్జీవోస్ నాయకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఎమ్మెల్యేను సత్కరించి స్వామివారి ప్రతిమను బహూకరించారు. పెద్దపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలి

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 28: జిల్లాలోని వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని బుధవారం తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టర్ ముజమిల్‌ఖాన్‌కు వినతిపత్రం ఇచ్చారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎరవెల్లి ముత్యంరావు, ప్రధాన కార్యదర్శి ఎండి ఖాజా, అంబాల లక్ష్మణ్, పైడిపల్లి నాగయ్య, అశోక్, కుమార స్వామి పాల్గొన్నారు.

ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలి

ఓదెల, ఫిబ్రవరి 28 : రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని మార్కెట్ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య తహసీల్దార్ యాకయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. కొప్పుల సత్యం, గణేష్, నాగార్జున, సదానందం, పోలంపల్లి రామిరెడ్డి, తొట్ల శ్రీకాంత్, నాగయ్య పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం



నమూనాలను తిలకిస్తున్న డీఈవో మాధవి



ఖనిలో విద్యార్థులతో మాట్లాడుతున్న వన్‌టౌన్ సీఐ



ముత్తారంలో ప్రదర్శనను తిలకిస్తున్న ప్రత్యేక అధికారి

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 28 : సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో పలు ప్రైవేట్ కళాశాలలోనూ ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లో ఘనంగా సైన్స్ ఫెయిర్ బుధవారం నిర్వహించారు. విద్యార్థులు అనేక రకాల ఎగ్జిబిట్స్‌ను తయారుచేసి ప్రదర్శనలో ఉంచారు. పెద్దపల్లి పాఠశాలలో జరిగిన సైన్స్‌ఫెయిర్ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మమతారెడ్డి హాజరై విద్యార్థుల ప్రదర్శనలు తిలకించారు. గాయత్రి కళాశాల, పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహించారు. కరస్పాండెంట్ అల్లెంకి శ్రీనివాస్ పాల్గొన్నారు. ట్రినిటీ డిగ్రీ, పీజీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజు, వైస్‌ప్రిన్సిపాల్ నితారెడ్డి పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 28: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం గోదావరిఖనిలోని పలు విద్యాసంస్థలలో ఘనంగా నిర్వహించారు. స్థానిక అడ్డగుంటపల్లిలోని కృష్ణవేణి విద్యాసంస్థలలో సైన్స్‌డే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యాసంస్థల డైరెక్టర్ మంజులాశ్రీనివాస్‌రెడ్డి హాజరై డాక్టర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్‌కట్ చేశారు. విద్యార్థులు తయారుచేసిన సైన్స్ ఎగ్జిబిట్స్ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కళ్యాణ్‌నగర్‌లోని ఆపిల్‌కిడ్స్‌లో సైన్స్‌డే వేడుకలు నిర్వహించారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్, ఎంఈవో పి.సంపత్‌రావు, వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు హాజరయ్యారు. పాఠశాల ప్రిన్సిపాల్ గాలి సునిత, కార్పొరేటర్ బాలరాజ్‌కుమార్, నాయకులు పెద్దెల్లి ప్రకాష్, వైస్‌ప్రిన్సిపాల్ అనిత, ఇన్‌చార్జీలు అరుణ, సుస్మిత, విద్యార్థులు పాల్గొన్నారు. సప్తగిరికాలనీలోని మహాత్మాజ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో సైన్స్‌డే వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ రజిత సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్‌ప్రిన్సిపాల్ సబితారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎన్‌టీపీసీ అన్నపూర్ణకాలనీలోని రావూస్ ఇంటర్నేషన్ స్కూల్ విద్యార్థులు రామగుండంలోని వాతావరణ కేంద్రాన్ని క్షేత్రస్థాయి అధ్యయనం చేశారు. ఫిజిక్స్ రోబోటిక్ హెడ్‌ఆఫ్‌ది డిపార్ట్‌మెంట్ దినేష్‌కుమార్,ప్రిన్సిపాల్ సాధన పాల్గొన్నారు.

మంథని, ఫిబ్రవరి 28: జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల్లోని విద్యార్థులు పలు సైన్స్‌ప్రాజెక్టులను తయారు చేశారు. స్థానిక కృష్ణవేణి, శ్రేష్ఠ కిడ్స్ పాఠశాలల్లోని విద్యార్థులు సైన్స్ దినోత్సవం సందర్భంగా పలు ప్రత్యేక సైన్స్ ప్రాజెక్టులను తయారుచేశారు.

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 28: మండలంలోని మంగపేట, మల్యాల గ్రామాల్లో ఉన్నత పాఠశాలల్లో బుధవారం సైన్స్‌డే వేడుకలు జరిగాయి. విద్యార్థులు వారి ప్రయోగాలను ప్రదర్శించారు. ఎంపీపీ నూనేటి సంపత్, గ్రామకార్యదర్శి రాజ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, సత్యలక్ష్మి, నాగేశ్వర్‌రావు, ఎంఎన్‌ఓ మహేష్, మోత్కూరి నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే కాల్వశ్రీరాంపూర్ ఎస్సీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం ఈర్ల సమ్మయ్య, టీచర్లు ఎడ్ల విజయలక్ష్మి, కర్ర సమత, చెన్నూరి భారతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ముత్తారం, ఫిబ్రవరి 28 : మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో జాతీయ సైన్స్ డే సందర్భంగా సైన్స్‌ఫెయిర్ ఏర్పాటు చేశారు. కళాశాల ప్రత్యేక అధికారి కమలతోపాటు ఉపాధ్యాయుల బృందం సందర్శించి ఉత్తమంగా ఉన్న ప్రదర్శనకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలక్ష్మి, రాధికలు పాల్గొన్నారు.

రామగిరి, ఫిబ్రవరి 28: మండలంలోని వాణి పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులకు క్విజ్, సైన్స్ ప్రయోగాలు, ఉపయోగాలు అనే అంశాలపై వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎంఎ ఖయ్యూం, వైస్ ప్రిన్సిపాల్ ప్రేమలత, పీఈటీ బొద్దుల తిరుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్, ఫిబ్రవరి 28 : మండల వ్యాప్తంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని ఆపిల్ కిడ్స్, కంఫర్ట్ పాఠశాలలో జాతీయ సైన్స్ డే వేడుకల సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల ప్రయోగాలను ప్రదర్శించారు. విద్యార్థులను ప్రయోగాల తీరును తెలుసుకొని పాఠశాల కరస్పాండెంట్‌లు అర్నకొండ వినయ్‌కుమార్, చదువు వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపాల్‌లు అర్నకొండ సౌమ్య, రాజమణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

సుల్తానాబాద్, ఫిబ్రవరి 28: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ వారు అందజేస్తున్న అరుదైన ఇన్‌స్పైర్ అవార్డులు సుల్తానాబాద్‌కు చెందిన సెయింట్ మేరీ స్కూల్ విద్యార్థులకు లభించాయి. ఏడవ తరగతి చదువుతున్న గౌరవ్ మాలిక్, పదో తరగతి చదువుతున్న కనుకుల తేజస్వినిలకు అవార్డులు అందజేశారు. ఒక్కొక్కరికి పది వేల నగదు బహుమతి అందజేసి సత్కరించారు. కరస్పాండెంట్ ప్రిన్సిపాల్ ఫాదర్ తుమ్మ జోసెఫ్ అశోక్ మాట్లాడుతు మండలంలోనే తమ విద్యార్థులకు అవార్డులు రావడం అభినందనీయమన్నారు. విద్యార్థులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వినయ్, సంపత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిపై కబ్జాదారుల కన్ను

అంతర్గాం, ఫిబ్రవరి 28: మండల పరిధిలోని విస్సంపేట శివారులోని ఐకేపీ సెంటర్‌కు సమీపంలోని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 365, 369లో సుమారు 100 ఎకరాల భూమిపై కబ్జాదారుల కన్ను పడింది. నాలుగు రోజులుగా కొందరు గుర్తు తెలియని వ్యక్తులు సదరు ప్రభుత్వ భూమిని రాత్రికి రాత్రే జేసీబీలు, బ్లేడ్ ట్రాక్టర్లతో చదును చేసున్నారు. ఇటీవల ఓ మాజీ నక్సలైట్ కూడా తనకు ప్రభుత్వం పునరావాసం కింద 10ఎకరాల భూమిని మంజూరుచేసినట్టు పేర్కొంటూ భూమి చదును పనులు చేపట్టినట్టు గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో తమ గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు, ప్రభుత్వం గ్రామంలోని భూమిలేని నిరుపేద కుటుంబాలకు పంపిణీ చేయాలని కోరుతున్నారు. స్థానిక రెవెన్యూ అధికారులు స్పందించి గ్రామంలో జరుగుతున్న భూ కబ్జాలను అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. విస్సంపేట గ్రామ శివారులో జరుగుతున్న భూ కబ్జాల విషయం ఇప్పటివరకు తమ దృష్టికి రాలేదని తహసిల్దార్ పీ రాంమోహన్‌రావు తెలిపారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లతో భూ కబ్జాపై విచారణ చేయించి కబ్జాకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని కాపాడుకుంటాం.

వీరభద్రస్వామి ఆలయంలో హోమం

ఓదెల, ఫిబ్రవరి 28 : మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో ఉన్న వీరభద్ర స్వామి క్షేత్రంలో మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. వీరభద్ర స్వామి, మదన పోచమ్మ, బంగారుపోచమ్మ ఆలయాల ప్రతిష్ఠించి ఏడాది గడిచిన సందర్భంగా హోమం నిర్వహించారు. ఈవో సదయ్య, ధర్మకర్తల మండలి సభ్యులు కనికిరెడ్డి సతీష్, చింతం మొగిలి, రాపర్తి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

మంత్రి, ఎమ్మెల్యేను కలిసి కాంగ్రెస్ నాయకులు

గోదావరిఖని, ఫిబ్రవరి 28: రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ను బుధవారం రాష్ట్ర సచివాలయంలో కాంగ్రెస్ నాయకులు కొలిపాక సుజాత, కొప్పుల శంకర్, నాయిని ఓదెలు, బొమ్మక రాజేష్, తిప్పారపు శ్రీనివాస్, కళ్యాణి సింహాచలం, గుంపుల తిరుపతి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబుకు చిత్రపటాన్ని బహూకరించారు.



ప్రభుత్వం మారినా అవినీతి తగ్గలేదు

- గెలిచిన సంఘాలు ఆదర్శంగా ఉండాలి
- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల రాజిరెడ్డి

గోదావరిఖని, ఫిబ్రవరి 28: రాష్ట్రంలో ప్రభుత్వం మారిన సింగరేణిలో అవినీతి తగ్గలేదని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న అవినీతినే పెంచి పోషించుకుంటూ వస్తున్నారు తప్ప అవినీతి మాత్రం తగ్గడం లేదని, గ్రూపు రాజకీయాలు మొదలు పెట్టి దోచుకోవడమే జరుగుతుందన్నారు. ఇప్పటికీ మెడికల్‌బోర్డులో జరిగే అవినీతి అందరికి తెలుసునని, అయినా చర్యలు తీసుకోవడంలో విజిలెన్స్ అధికారులు వెనుకడుగు వేయడానికి కారణం ఏమిటో తెలియడం లేదన్నారు. అమాయకులపైన చర్యలు తీసుకోవడానికి ఉత్సాహం చుపుతూ అవినీతికి పాల్పడుతూ కార్మికుల రక్తాన్ని పీల్చుకుంటున్న జలగలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. సింగరేణి యాజమాన్యం విజిలెన్స్ కలిసి కారుణ్య నియామకాల్లో జరుగుతున్న అవినీతి, క్వార్టర్ల కేటాయింపులో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని, అప్పుడే కార్మికులకు న్యాయం జరుగుతుందన్నారు. గతంలో ఎమ్మెల్యే జోక్యం పెరుగుతుందని చెప్పిన నాయకులే ఇప్పుడు వారితో వేదికలు పంచుకోవడం సింగరేణిలో మార్పు లేదని స్పష్టమవుతుందన్నారు. గెలిచిన సంఘాల నాయకులు పని చేస్తూ ఆదర్శంగా ఉండాలే తప్ప యాజమాన్యానికి తొత్తుగా మారవద్దని, సంస్థ అభివృద్ధికి తోడ్పడుతూ కార్మికుల సమస్యలపై యాజమాన్యాన్ని ప్రశ్నించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బ్రాంచ్ కార్యదర్శి మెండె శ్రీనివాస్, ఉపాధ్యక్షులు రాజమొగిలి, విజయ్‌కుమార్, దాసరి సురేష్, రవి, ప్రసాద్, రవీందర్‌రెడ్డి, రాంప్రసాద్, రాము పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి

ఆర్జీ-1 ఇన్‌చార్జి జీఎం బానోతు సైదులు

గోదావరిఖని, ఫిబ్రవరి 28: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని ఆర్‌జీ-1 ఇన్‌చార్జి జీఎం బానోతు సైదులు అన్నారు. బుధవారం వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కంపెనీ స్థాయి సింగరేణి స్కూల్స్ 2023-24 క్రీడా పోటీలను స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరదారుఢ్యం, జ్ఞానం పెరుగుతుందని, క్రీడల వల్ల ఉద్యోగాలకు వెళ్లినప్పుడు కూడా రిజర్వేషన్ వస్తాయన్నారు. క్రీడాకారులు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుని క్రీడల్లో మెళకువలను నేర్చుకుని ముందుకువెళ్లాలన్నారు. చిన్నప్పటి నుంచే క్రీడలపై మక్కువ పెంచుకోవాలని, ప్రతిఒక్కరూ క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలన్నారు. ఓటమి గెలుపునకు నాంది అవుతుందని సూచించారు. సింగరేణి 11 ఏరియాల నుంచి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.1500మీటర్ల పరుగుపందెం, 800, 400, 200, 100మీటర్ల పరుగుపందెం, షాట్‌పుట్, లాంగ్‌జంప్, జావెలిన్ త్రో, డిస్క్ త్రో, ఆర్చరీ, త్రోబాల్, హైజంప్,లాంగ్ జంప్ పోటీలను నిర్వహించారు.



క్రీడా జెండాను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి జీఎం బానోతు సైదులు

ఓవరాల్ చాంపియన్ సాధించిన ఇల్లందు పాఠశాల

ఈ పోటీల్లో ఇల్లందు ఏరియా ఎక్కువ పోటీల్లో గెలుపొంది ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించింది. బాలుర విభాగంలో పాండు, బాలికల విభాగంలో ప్రచిపాల్ విజయం సాధించారు. వీరిక సైదులు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం రాం మోహన్, సింగరేణి అధికారుల సంఘం అధ్యక్షుడు మల్లేష్, ఏఐటీయూసీ నాయకులు ఆరెల్లి పోషం, మహేష్, పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, స్పోర్ట్స్ కార్యదర్శి బంగార సారంగపాణి, అధికారులు అభిలాష్, రాజం, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ రమేష్, రాజయ్య, జాన్‌వెస్లీ, నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్మికవాడల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలి

- శిలాఫలకానికే పరిమితమైన నీటి శుద్ధి కేంద్రం - సీఐటీయూ కార్యదర్శి మెండె శ్రీనివాస్

గోదావరిఖని, ఫిబ్రవరి 28: సింగరేణి కార్మికవాడల్లో మంచినీటి సమస్యను పరిష్కరించడంలో యాజమాన్యం విఫలమైందని సీఐటీయూ ఆర్‌జీ-1 కార్యదర్శి మెండె శ్రీనివాస్ ఆరోపించారు. బుధవారం ఆర్‌జీ-1 ఏరియాలోని జీడీకే2ఇంక్లైన్‌లో కార్మికులు ఎదుర్కొంటున్న వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండం రీజియన్‌లోని కార్మిక కుటుంబాలు రెండు సంవత్సరాలుగా తాగునీరు అందక అనేక ఇబ్బందులు పడుతున్నారని, సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటాలు చేసి వినతి పత్రాలు అందించినా పట్టించుకోవడంలేదని, యాజమాన్యం పది ఆర్‌ఓ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించి అందులో ఐదు మాత్రమే అందుబాటులోకి తీసుకువచ్చిందని, రూ.20 కోట్లతో మంచినీటి శుద్ధి కేంద్రాని ఏర్పాటు చేస్తామని చెప్పి ఆరు నెలలు అవుతున్నా ఇప్పటి వరకు శిలాఫలకానికే పరిమితం కావడం దురదృష్టమన్నారు. మురికి నీటిని సేవించి కార్మిక కుటుంబాలు, కార్మికులు అనారోగ్యం పాలవుతున్నా యాజమాన్యం స్పందించడం లేదని, రక్షిత మంచి నీటిని అందించాలని డిమాండ్ చేస్తూ మార్చి 1న ఆర్‌జీ-1 జీఎం కార్యాలయం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు, ఈ ధర్నాకు కార్మికులు, కార్మిక కుటుంబాలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, రాములు, శంకర్, సమ్మయ్య, బీమానాయక్, సంపత్, నంది నారాయణ, జనార్ధన్, సురేష్, చంద్రయ్య, ఓదెలు, సంతోష్, రాజమౌళి, రవి పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

ఓసీపీ-2లో మొరాయిస్తున్న సైజర్ క్రషర్స్

- చిన్నచిన్న మట్టి పెళ్లలకే నిలిచిపోతున్న వైనం
- నేడు సీఎండీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం

రామగిరి, ఫిబ్రవరి 28: ఓసీపీ-2 ప్రాజెక్టులో కోట్ల రూపాయలను వెచ్చించి కొనుగోలు చేసిన జర్మనీ సాంకేతిక పరిజ్ఞానంతో నడిచే క్రషర్లు మొరాయిస్తున్నాయి. ఓసీపీ-2 క్వారీలో జరిగే బొగ్గు వెలికితీతలో పెద్దబోల్డర్‌లు, బొగ్గు పెళ్లలను డంపర్‌ల సహాయంతో క్వారీలో ఉండే క్రషర్లలో అన్‌లోడ్ ప్రక్రియను చేపడుతారు. అన్‌లోడ్‌లో వచ్చే పెద్ద బొగ్గు పెళ్లలను సైజర్ క్రషర్‌లో క్రషింగ్ చేసి అనంతరం కన్వేయర్ బెల్టు ద్వారా ప్రాజెక్టు ఉపరితలానికి తరలిస్తుంటారు. దానికి కోసం సింగరేణి సంస్థ సుమారు రూ.40కోట్లతో రెండు సైజర్ క్రషర్స్‌ను ప్రాజెక్టు క్వారీలో బిగించింది. బిగింపు పనులను సింగరేణి కంపెనీ కొన్ని నెలల క్రితం టెక్రాఫ్ కంపెనీకి అప్పగించి పనులను పూర్తిచేసింది. ట్రయల్ రన్‌లో సైతం చిన్నపెళ్లను క్రషింగ్ చేయడం లేదనే ఆరోపణలు వినిపించాయి. గతంలో ఏర్పాటు చేసిన పాత క్రషర్స్ ద్వారానే క్రషింగ్ పనులు కొనసాగుతున్నాయి. కోట్లు వెచ్చించి కమిషనింగ్ చేపట్టిన సైజర్ క్రషర్‌లు నిత్యం మొరాయిస్తుండడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నూతనంగా ఏర్పాటైన పనిచేయని సైజర్ క్రషర్స్‌ల వద్ద కార్మికులకు విధులు అలాట్ చేయడం కొసమెరుపు. చిన్న బోల్డర్(బండ)ను సైతం క్రషింగ్ చేయలేని పరిస్థితిలో సైజర్ క్రషర్ నిలిచిపోతున్నట్లు తెలిసింది. క్రషర్‌కు సంబంధించి ఆయిల్ పైప్‌ల కారణంగానే సాంకేతిక ఇబ్బందులు తలెత్తుతున్నయని అధికారులు చెబుతున్నారు. సైజర్ క్రషర్స్ మొరాయింపుతో క్రషర్‌లో పడిన బోల్డర్‌లను షావల్‌తో తొలగించే ప్రక్రియ నిరంతరం కొనసాగే పరిస్థితి నెలకొన్నట్లు తెలిసింది. కాగా ఈ క్రషర్స్‌ను గురువారం సింగరేణి సీఎండీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేపట్టనున్నారు.

ఈ విషయమై ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు వివరణ కోరగా, సైజర్ క్రషర్స్ కమిషనింగ్ పనులు జరుగుతున్నాయని, ట్రయల్ రన్‌లో ఒన్‌పైప్‌ల్లో సాంకేతిక ఇబ్బందులు తలెత్తడం వల్ల క్రషింగ్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. వాటి మరమ్మతులు సైతం పూర్తిచేస్తామని, కమిషనింగ్ పనులు ఆలస్యంగా జరిగాయని, సజావుగా నడిచేందుకు అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు.



ఓసీపీ-2లో సైజర్ క్రషర్లు

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్

ధర్మారం, ఫిబ్రవరి28: తిరుమలలో శ్రీవెంకటేశ్వర స్వామిని బుధవారం ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దర్శించుకున్నారు. అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు టీటీడీ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం శ్రీవారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. తర్వాత అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు ఆలయ దేవస్థానం అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ధర్మపురి ఎమ్మెల్యేగా విప్‌గా మొదటి సారి శ్రీవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని ఆయన అన్నారు. ఏడుకొండలస్వామి ఆశీస్సులతో ఇటీవల జరిగిన ప్రమాదం నుంచి బయటపడ్డానని చెప్పారు.

విగ్రహ ప్రతిష్ఠకు భూమి పూజ

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 28 : మండలంలోని రాఘవపూర్ గ్రామానికి ఆనుకొని ఉన్న గుట్ట ప్రాంతంలో జాంబవ చక్రవర్తి విగ్రహాన్ని ప్రతిష్ఠించుటకు బుధవారం మాదిగ శక్తి వ్యవస్థాపకులు బోంకూరి సురేందర్ సన్నీ, జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి రవి ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు కుమ్మరి సదయ్య, నాయకులు పుల్లూరి నాగరాజు, కల్లెపల్లి సతీష్, కల్లెపల్లి కిషోర్, కుమ్మరి శ్రీశైలం, కుమ్మరి సందీప్, గట్టయ్య, మోదుంపల్లి చిన్న అంజయ్య పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు

-11ట్రాక్టర్లు, ఎక్స్‌కావేటర్ సీజ్

ధర్మారం, ఫిబ్రవరి28: ధర్మారం మండలం కొత్తూర్ గ్రామ శివారులో బుధవారం అనుమతులు లేకుండా అక్రమంగా కొందరు తవ్వకాలు చేపట్టారు. అక్రమంగా మట్టి తరలింపుపై పలువురు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కొత్తూర్ శివారులో అక్రమంగా మట్టి తరలిస్తున్న 11ట్రాక్టర్లను, ఒక ఎక్స్‌కావేటర్‌ను ఎస్సై సత్యనారాయణ స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు అప్పగించినట్టు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

వైభవంగా చతుర్థి వేడుకలు

మంథని, ఫిబ్రవరి 28: స్థానిక మంత్రపురి శ్రీమహాగణపతి ఆలయంలో చతుర్థి వేడుకలను భక్తులు బుధవారం వైభవంగా నిర్వహించారు. సంకటహర చతుర్థిని పురస్కరించుకొని శ్రీమహాగణపతి స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు పల్లి రాము ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజించారు. భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఆలయ అవరణ భక్తులతో సందడి గా మారింది.

విద్యుత్ సమస్యలను పరిష్కరించండి

కోల్‌సిటీ, ఫిబ్రవరి 28: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపూర్, ఎల్కలపల్లి, వీర్లపల్లి గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని గౌతమినగర్ ఏఈకి కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి కందుల సతీష్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోల్స్ విరిగిపోయాయన్నారు. లక్ష్మీపురం మూల మలుపులో విద్యుత్ పోల్ ప్రమాదకరంగా ఉండడంతో దానికి సపోర్టు వేశారని, అది శిథిలావస్థకు చేరుకుందని తెలిపారు. చాలా వరకు మధ్యన పోల్స్ లేకపోవడంతో విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదభరితంగా మారాయన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సబ్ స్టేషన్ నుంచి 14వ డివిజన్‌కు విద్యుత్ సరఫరా చేస్తే సమస్యలు తొలగిపోతాయన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ధర్నా

పాలకుర్తి, ఫిబ్రవరి 28: మండలం పరిధిలోని కుక్కలగూడూర్‌లో ప్రధాన రహదారి మరమ్మతు పనులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం గ్రామస్థులు రోడ్డుపై ధర్నా నిర్వహించి ఆందోళన చేపట్టారు. సమాచారం తెలుసుకున్న సంబంధిత శాఖల అధికారులు ఆందోళనకారులతో ఫోన్‌లో మాట్లాడి వీలైనంత తొందరలో రోడ్డు నిర్మాణం చేపట్టేలా చర్యలు చేపడుతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

ముత్తారం, ఫిబ్రవరి 28: ముత్తారం మండలం ఓడెడ్ గ్రామానికి చెందిన పోలవేని సతీష్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు తెలుపగా వెంటనే బాధితుడికి రూ.2,50,000 ఎల్‌వోసీని అందజేశారు. బుధవారం మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు సహాయకులు బాధితుడి కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీ పత్రాన్ని అందజేశారు.

'చలో మేడిగడ్డ'ను విజయవంతం చేయాలి

ముత్తారం, ఫిబ్రవరి 28: చలో మేడిగడ్డ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నామని, దీనిని నాయకులు కార్యకర్తలు విజయవంతం చేయాలని మంథని నియోజకవర్గ యూత్ నాయకులు దుబాసి లేనిన్ కోరారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 40లక్షల ఎకరాలకు సాగు నీరందించే తెలంగాణ రైతాంగానికి వరప్రదాయిని అయిన కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ కుట్రలను ఎండగడతామన్నారు. అసలు వాస్తవాలు ప్రజలకు తెలియజేయడానికి 150 మంది నేతలతో కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు కేటీఆర్ వస్తున్నారని పేర్కొన్నారు.

ఘనంగా టైలర్స్ డే



టైలర్స్‌ను సన్మానిస్తున్న మేర సంఘం నాయకులు

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి28: టైలర్స్ డే సందర్భంగా బుధవారం కళ్యాణ్ నగర్‌లోని మేరు భవన్‌లో కేక్‌కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. అనంతరం సీనియర్ టైలర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేర సంఘం అధ్యక్షుడు కీర్తి నాగరాజు, గట్ల రమేష్, సర్వేశ్వర్, నర్సయ్య, వెంకటేషం, స్వామి, ఓదెలు, రాంమూర్తి, సత్తయ్య, వినయ్, శంకర్, రవి, గూడూరి పవన్‌కుమార్, శ్యాంసుందర్, రాజు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

పాలకుర్తి, ఫిబ్రవరి 28: మండలం పరిధిలోని పుట్నూర్, గాంధీనగర్, బసంత్‌నగర్ కేశోరాం సిమెంటు కర్మాగారం ఎదుట బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి వేల్పుల రాజ్‌కుమార్, పుట్నూర్ ఎంపీటీసీ గంగాధరి రమేష్‌గౌడ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంతెన స్వామి, రైతు సెల్ అధ్యక్షుడు నారా సత్తయ్య పాల్గొన్నారు. కేశోరాం కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సూర సమ్మయ్య ఆధ్వర్యంలో కార్మికులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కాల్వ అంజయ్య, దాడి పోచమల్లు, దుర్గం జగన్ తదితరులు పాల్గొన్నారు.

'పొన్నం ప్రభాకర్‌ను విమర్శిస్తే ఊరుకోం'

ఎలిగేడు, ఫిబ్రవరి 28: రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను విమర్శించే హక్కు కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌కుమార్‌కు లేదని ఆర్యవైశ్య మండల ప్రధాన కార్యదర్శి కాంగ్రెస్ నాయకుడు తాటిపల్లి సతీష్‌బాబు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పొన్నం ప్రభాకర్ పదవి ఉన్నా లేకున్నా ప్రజల్లో మమేకమై తిరుగుతారన్నారు. అలాంటి నాయకుడిని రాజకీయ లబ్ధి కోసం బండి సంజయ్ విమర్శించడం తగదన్నారు.

పీడీఎస్ బియ్యం నిల్వలు స్వాధీనం

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 28: గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి అల్లూరులో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని బుధవారం జిల్లా పౌర సరఫరాల అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అల్లూరుకు చెందిన మోతె కనకయ్య ఇంట్లో పీడీఎస్ నిల్వలు ఉన్నాయనే సమాచారం మేరకు జిల్లా పౌరసరఫరా శాఖ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు సిబ్బందితో కలసి తనిఖీ చేశారు. అధికారుల తనిఖీల్లో 60 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించారు. తక్కువ ధరకు పీడీఎస్ బియ్యాన్ని కొని ఎక్కువ ధరకు మహారాష్ట్రకు సరఫరా చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్ పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు అప్పగించారు. మోతె కనకయ్యపై అధికారులు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.